# బైబిలులోని ప్రవచనాలు

బైబిలు భావంలో ప్రవచనమంటే – గతానికి సంబంధించినదైనా, ప్రస్తుతానికి లేక భవిష్యత్తుకు సంబంధించినదైనా సరే, దేవునినుండి వచ్చిన సందేశమని భావం. మానవ మనస్సులు గతాన్ని, ప్రస్తుతాన్ని సర్వే చేయగలవైనందునను, భవిష్యత్తును ముందుగా చెప్పలేనివైనందున, రాబోయే సంగతులను ఖచ్చితంగా చెప్పడం మానవాతీతమైనదై యుండాలి. అందువలన, బైబిలు ప్రవచనాలు దైవిక ప్రదర్శనలైయుంటాయి. అద్భుత శక్తివలె అద్భుత జ్ఞానము ప్రకృతికి అతీతమైనదై ఉంటుంది . మనుష్యుడు ఏ విధంగానూ ఎరుగ శక్యంకాని జరుగబోయే నిజ సంగతులను బైబిలు ముందుగానే చెప్పగల శక్తిగలదైనప్పుడు, నరుడు కాదు దేవుడే బైబిలు కర్త అని రుజువు చేస్తుంది.

బైబిల్లో పలువిధములైన ప్రవచనాలు కన్పిస్తాయి. ప్రత్యేకించి పట్టణాలు, దేశములు, జనులు, రాజ్యములు; ప్రభువైన యేసుతో కలిపి వ్యక్తులను గూర్చి చాలా ప్రవచనాలు పలుకబడ్డాయి. (ప్రభువైన యేసును గూర్చిన కొన్ని ప్రవచనాలు ప్రస్తావించబడ్డాయి. ఈ పరిశీలనలో అవి యింకా విస్తృతమౌతాయి).

## పట్టణాలను గూర్చిన ప్రవచనాలు

### యెరికో

యెహోషువవలన యెరికో నాశనం చేయబడిన తరువాత, ఆ పట్టణాన్ని తిరిగి కట్టడానికి ఎవడు బాధ్యుడైయుంటాడో, అతడు తన కుమారులలో జేష్ఠుని, కనిష్ఠుని పోగొట్టుకుంటాడని అసాధారణమైన ప్రవచనాన్ని చెప్పాడు (యెహోషువ 6:26). రమారమి అయిదు వందల సంవత్సరాల తరువాత హీయేలు అనువానియందు ఈ ప్రవచనం ప్రత్యేకించి నెరవేర్చబడింది. యెరికోను తిరిగి కట్టేటప్పుడు, ఆ బేతేలీయుడు అబీరాము అను జ్యేష్ఠ పుత్రుని పోగొట్టుకున్నాడు, సెగూబు అను తన కనిష్ఠ పుత్రుని పోగొట్టుకున్నాడు (1 రాజులు 16:34).

### తూరు

“ఫెనీకయలో మిగుల సుప్రసిద్ధమైనదియు, ప్రాచీన ప్రపంచపు వాణిజ్య కేంద్రమునై యున్న” తూరును గూర్చి కనీసం అయిదుగురు దేవుని ప్రవక్తలు దైవ సందేశాన్ని యిచ్చారు.

అనేక దేశములచేత అది దండెత్తబడును (యెహెజ్కేలు 26:3). బబులోనీయులు, గ్రేకేయులు, రోమీయులు, తురుష్కులు అనేవారు దానిపైబడ్డారు. డెభై సంవత్సరాలు తూరు మరువబడును (యెషయా 23:15). బబులోను తూరుపైబడి దాన్ని కూలద్రోయడానికి ముందు రమారమి 125 సంవత్సరాలకు ముందు ఈ ప్రవచనం చెప్పబడింది. శతాబ్దంలో మూడు భాగాల కాలం విస్మరింపబడిన తరువాత, మరొక స్పష్టమైన ప్రవచనం, సముద్రము మధ్య తూరు బలమైనదైయుండునని చెప్పింది (యెహెజ్కేలు 26:17). డెభై ఏండ్లు విడిచిపెట్టబడిన తరువాత, తిరిగి వచ్చినవారు పాత స్థలంలో దాన్ని తిరిగి కట్టకుండ, తీరంనుండి అర్ధమైలు దూరముననున్న ద్వీపానికి వెళ్లారు.

తూరు నగరపు రాళ్లు, కలప, మన్నును నీళ్లలో ముంచివేయబడి, వట్టి బండగా అది బయట పడుతుందని యెహెజ్కేలు ప్రవచించాడు (యెహెజ్కేలు 26:12-14). మహా అలెగ్జాండర్ పాత పట్టణంనుండి ద్వీపపు పట్టణానికి కాలిబాట కట్టడానికి సులభంగా తీసుక పోదగ్గ సమస్తాన్ని ఉపయోగించుకొన్నప్పుడు ఈ ప్రవచనం నెరవేర్చబడింది. ఆ పాత పట్టణం వలలు పరచుకునే స్థలంగా మారుతుందని ప్రవక్త ముందుగానే తెలియజేశాడు (యెహెజ్కేలు 26:5, 14). పాత పట్టణపు బండమీద చేపలు పట్టుకునేవారు తమ వలలను ఎండబెట్టుకుంటున్నట్టు ప్రయాణీకులు కనుగొన్నారు. క్రొత్త పట్టణం, దహించ బడుతుందని కూడా ప్రవక్త ముందుగానే చెప్పాడు (ఆమోసు 1:10; జెకర్యా 9:3, 4). ది గ్రేట్ అలెగ్జాండరు తూరు పట్టణాన్ని వశం చేసుకోడానికి చాలా కాలం ప్రయత్నించి సాధ్యం కానందున చివరకు పట్టణాన్ని పాడుచేసి కాల్చివేశాడు.

తరువాత కాలంలో తూరీయులు విగ్రహారాధననుండి మరలి, నిజదేవుని అంగీకరించారు. ప్రభువైన యేసు ఫెనీకే స్త్రీని ఆమెకుగల గొప్ప విశ్వాసాన్ని చూచి మెచ్చుకున్నాడు (మత్తయి 15:21-28), యెరూషలేముకు వచ్చే తన చివరి ప్రయాణంలో పౌలు అక్కడ ఒక సంఘాన్ని స్థాపించాడు (అపొ. 21:3-5). డయోక్లేషియన్ శిక్షా కాలంలో, "ఒప్పుకొనే వారిని, హతసాక్షులను" తూరు యిచ్చింది.

**బబులోను**

అనేక సంవత్సరాలు అష్షూరు నీనెవెను రాజధాని నగరుగా ఉంచుకొని (c. 854-612 క్రీ.పూ), ప్రపంచాధికార శక్తిగా ఉండేది. పాలస్తీనాలోని యిద్దరు ప్రవక్తలు కల్దీయుల[1] ఔన్నత్యము, అంతిమ పతనం అనేవాటిని గూర్చి పలికారు (c. 605-538 క్రీ.పూ). బబులోను దానికి రాజధాని నగరుగా ఉండేది. మానవుని అంతర్ దృష్టి అష్షూరు పతనాన్ని చూడ గలిగేది కాదు, కాని దైవ ప్రేరేపితులైన ప్రవక్తలు ఔన్నత్యాన్ని మాత్రమే గాక, మరొక ప్రపంచ రాజ్య పతనాన్ని కూడా ధైర్యంగా ప్రకటించారు (యెషయా 13:19; 21:9). అలా సంభవించడానికి రమారమి రెండు శతాబ్దాలకు ముందే దాని పతనాన్ని ప్రకటించారు. అప్పుడు, కల్దీయ ఔన్నత్య అనంతరం, దేవుడు మరొక ప్రవక్తను పంపి, ఆ దేశము యొక్క నాశనమును గూర్చి తెలిపాడు. అది జరగడానికి యాభైయారు సంవత్సరాలకు ముందు తెలపడం జరిగింది (యిర్మీయా 25:12; 27:8; 50:10; 51:24; హబక్కూకు 2ను కూడా చూడు).

ఏ పట్టణమైనా ఎప్పుడైనా అభేద్యమైనదిగా కన్పించితే, అది బబులోనే. ఎత్తయిన వెడల్పైన ప్రాకారాలు, యిత్తడి తలుపులు తిరుగబడేవారందరిని వెనుకకు తరిమికొట్టాయి, అయినా యూదయలోని దేవుని ప్రవక్తలు ఆ గొప్ప పట్టణం కూలిపోతుందని ప్రకటించ డానికి సాహసించారు.

బబులోను పతనాన్ని గూర్చి ప్రత్యేకమైన వివరాలు ప్రకటింపబడ్డాయి. మాదీయులు మరియు ఎలామీయులు (పారసీకులు) విజయవంతంగా దండెత్తేవారని, వారి పేర్లతో సహా ప్రకటించబడ్డాయి (దానియేలు 5:28). వారి రాజైన కోరెషు సహితము తన పేరుతో సూచింపబడ్డాడు (యెషయా 44:28). తాను జయించియుండగలిగే ఆయా దేశాలు ఎదురు తిరిగే సైన్యంలో భాగమైయుంటాయట (యిర్మీయా 50:27–32). నది ఎండగట్ట బడుతుంది (యెషయా 44:27; యిర్మీయా 51:36). యూఫ్రటీస్ నదీ జలాలను కోరెషు దారి మళ్లించినందున, ఆ నది ప్రవాహ మార్గం గుండానే ఆ పట్టణ ప్రవేశం క్రీ.పూ. 538లో నెరవేర్చబడింది. బబులోనులో అరుపులతో కూడిన గొప్ప విందు, త్రాగుబోతుతనం ముందుగా ప్రవచింపబడింది (యిర్మీయా 51:39, 58). కొన్ని తలుపులు తెరువబడినట్టు విడిచిపెట్టబడాలి (యెషయా 45:1). ఉత్సవ సమయంలో యిరువైపుల లోపలనున్న పుర ద్వారాలు తెరువబడియుండగా, కోరెషు యొక్క సైనికులు మత్తులైయున్న రాజనగరు ద్వారపాలకులను ఆశ్చర్యంలో ముంచివేసినప్పుడు ఈ రెండు ప్రవచనాలు నెరవేర్చబడ్డాయి. అపారమైన ధనము అతని స్వాధీనం చేయబడుతుందని ప్రవక్త చెప్పాడు (యెషయా 45:3), అలాగే జరిగింది కూడా.

సర్వనాశనము బబులోను గతియైయుంటుంది (యెషయా 47:11). నెరవేర్పు క్రమేణా వచ్చింది. కోరెషు పట్టణాన్ని క్షీణింపజేసిన తరువాత, పారసీకుడైన దరియావేషుచే అది తిరిగి పట్టబడింది, ఆ తరువాత దిగ్రేట్ అలెగ్జాండర్ వచ్చాడు. క్రీ.శ. రెండవ శతాబ్దానికి వచ్చేసరికి కేవలం గోడలు తప్ప మరేమియు మిగలలేదు. సరకెన్స్ కాలానికి, గాలికి కొట్టుకొని వచ్చిన ఎడారి ఇసుకచే ఒకప్పుడు ఎత్తుగానున్న గోడలు పూడిపోయి పూర్తి వినాశనం కలిగింది. ప్రవక్త లిద్దరు – నీటి మడుగులను గూర్చియు (యెషయా 14:23), ఎండిన భూమిగాను అరణ్యముగాను (యిర్మీయా 51:43) చేయబడుతుందని ప్రవచించారు. రెండు ప్రవచనాలు నెరవేర్చబడ్డాయి; ఎండిన అరణ్య ప్రదేశముగా ఉన్న బబులోనులో ఎక్కడో ఒకచోట నిలిచిపోయిన నీటి మడుగులు కన్పిస్తాయి.

మహా బలీయమైన బబులోను పుట్టి రాజ్యములకు భూషణమును కల్దీయులకు గర్వకారణంగాను ఉంటుందని ప్రవచింపబడింది (యెషయా 13:19). తరువాత అది నివాస స్థలముగా కాకుండ పోతుందని, గొర్రెల కాపరులు తమ మందను అక్కడ రాత్రి పండుకొననియ్యరని (యెషయా 13:20), అడవి జంతువులకును, నక్కలకును, అది నివాస స్థలంగా మారుతుందనియు (యెషయా 13:21, 22) ప్రవచింపబడింది. వారి నగరులలో నక్కలును వారి సుఖ విలాస మందిరములలో అడవి కుక్కలు మొరలిడును (యెషయా 13:22). అరమైలు చుట్టుకొలతతోను, 600 అడుగుల పైగా ఎత్తుతోను నిర్మింపబడిన బ్రహ్మాండమైన గుడి శిథిలమైపోతుంది (యిర్మీయా 51:37 చూడు). ప్రవక్త ముందుగా చెప్పినట్లే, ఆ ప్రాంతానికి పయనించేవారు ఆశ్చర్య చకితులౌతారు (యిర్మీయా 51:43).

విడిచిపెట్టబడిన బబులోను స్థలము స్థితి అలాగే కొనసాగుతుంది. గుడ్‌హోప్ శిఖరమును కనుగొని, ఇండియాకు క్రొత్త మార్గం కనుగొనుటనుబట్టి ఒకవేళ పాక్షికంగా అలా జరుగుతుందేమో. అలాగే విడిచిపెట్టబడిన స్థితికి కారణమేమైయున్నా, అది ఎప్పుడు నిర్మానుష్యంగా ఉండడమనేది ప్రవక్త యొక్క మాటలకు దైనికమైన నెరవేర్పుగా కన్పిస్తుంది. రాయబడిన బైబిలులో దేవుని హస్తం కన్పిస్తూ ఉంటుంది, మరియు బబులోను బహిష్కరింప బడిన స్థలంలో అది స్పష్టంగా కన్పిస్తుంది.

### నీనెవె

నీనెవె అనే మహా గొప్ప పట్టణము "మూడు దినముల ప్రయాణమంత పరిమాణము గలది" (యోనా 3:3), అరవై మైళ్ల చుట్టుకొలత గలది. వంద అడుగులు ఎత్తుగల దాని గోడలు, రెండువందల అడుగుల ఎత్తునుండే పదిహేనువందల గోపురములను బలపరచుతాయి. అది ఎంతటి బలీయమైనదైనా, ఆ పట్టణంలోని పాపాలు నాశనం చేయబడే దేవుని ప్రవచనాలను తెచ్చాయి. పొర్లిపారే వరదవలనను (నహూము 1:1, 8; 2:6), అగ్నివలనను (నహూము 3:13) అది పతనమౌతుందని ప్రవచింపబడింది. క్రీ.పూ. 612లో రెండును సంభవించాయి. టైగ్రిస్ నది పాక్షికంగా పట్టణాన్ని ముంచివేసింది, దాని గోడలోని భాగం కొట్టుకొని పోయింది, శత్రువు ప్రవేశించేలా కల్పించింది. శవ దహనమునకై రాజు ఏర్పాటు చేసిన చితి, తన రాజ నగరును, తన యింటివారిని, తనను కాల్చివేసిందట. బంగారం దానిలోనుండి కొల్లగొట్టబడుతుందని ప్రవచింపబడింది (నహూము 2:9), చరిత్ర దాన్ని రుజువు చేస్తుంది. నీనెవె పట్టణపు చోటు విడిచిపెట్టబడింది, ప్రఖ్యాతిగాంచిన దాని పేరు లేకుండపోయే స్థితికి చేరుకుంది.

### దమస్కు

దమస్కు శిక్షింపబడుతుందని, అగ్ని వేయబడుతుందని కూడా ఆమోసు ప్రవచించాడు (ఆమోసు 1:3-14). అది పాడైన దిబ్బగా ఉంటుందని యెషయా సయితము దృఢ పరచాడు (యెషయా 17:1). దమస్కు ఈ నాటికి నిలిచియున్నా, ఈ ప్రవచనాలు నెరవేర్చబడ్డాయి. అది పాడైన దిబ్బగా పలుసార్లు మారింది. క్రీ.పూ. 8వ శతాబ్దంలో, అష్షూరు రాజు దమస్కును పట్టుకొని దాని నివాసులను తీసికొని వెళ్లిపోయాడు. "మహా అలెగ్జాండరు" చేత అది అణచబడింది లేక క్షీణింపబడింది, మరలా సరాసెన్‌చేత కూడా.

## జనులను గూర్చి, దేశములను గూర్చిన ప్రవచనములు

### హెబ్రీయులు

జనులందరిలో హెబ్రీయులనుగూర్చి ఎక్కువ ప్రవచనాలు యివ్వబడ్డాయి. వారు ఐగుప్తులో దాసులైయుంటారు (ఆది. 15:13, 14). నిర్ణీతమైన కాలములో వారు విడిపించబడతారు (ఆది. 46:4). వారికి కనాను యివ్వబడుతుంది (ఆది. 15:18). వారిది గొప్ప జనమైయుంటుంది (ఆది. 46:3). వారు రెండు రాజ్యములుగా చేయబడతారు

(1 రాజులు 11:31). దక్షిణ రాజ్యము అష్షూరునుండి తప్పించబడి బబులోను చేతిలో పడిపోతుంది (1 రాజులు 14:15, 16); అయినా, అది సర్వనాశనము చేయబడదు. ఇతర దేశాలు, తన్ను పట్టుకొన్న బబులోను లయమైపోతుంది, కాని యూదా మాత్రం కాదు (యెషయా 13:20). యూదా బబులోనుకు డెబ్బైయేండ్ల కాలము సేవ చేసిన మీదట అది పునరుద్ధరించబడుతుంది (యిర్మీయా 25:11, 12). దేవుని శిక్ష శాశ్వతంగా యూదాను విగ్రహారాధననుండి పవిత్రపరచుతుంది. తదుపరి అది తన మూలరాతిని నిరాకరించి, అణచబడుతుంది (కీర్తన. 118:22).

హెబ్రీయులను గూర్చిన ప్రవచనపు నెరవేర్పులే, లేఖనములు దైవ ప్రేరేపితము లనడానికి బలమైన రుజువైయున్నాయి. కష్టము మరియు బాధ, పొగడ్తలేని ప్రవచనాలు హెబ్రీయుల కొరకు హెబ్రీయులచేతనే చేయబడ్డాయి. ఒకదానివెంట ఒకటి సంభవించాయి. తన ఆస్థానపు బోధకుడ్ని, బైబిలు దైవ ప్రేరేపితమనడానికి ఆధారం క్లుప్తంగా చూపుమని ఒకనాడు ఫ్రెడరిక్ ది గ్రేట్ అడిగాడట – "యూదులు, మహారాజ" అని వెంటనే జవాబు వచ్చింది.

### అరబ్బీయులు

ఇష్మాయేలు యొక్క సంతతిని దేవుడు యుద్ధ ప్రియులుగా చేయలేదు, కాని వారు అలాగౌతారని తెలుసు గనుక ప్రవచింపబడింది (ఆది. 16:12). తక్కిన దేశములవారిని నాశనం చేస్తానన్నట్లు, అరబ్బీయులకు ఆ భయం లేదు. ఇతర దేశాలు అంతరించిపోతాయి, కాని అరబ్బులు యింకను బలముగల గొప్ప జనముగానే ఉన్నారు, ఇది దేవుని ప్రకటనలకు సమన్వయంగా ఉంది.

### మోయాబీయులు

ఒకప్పుడు మోయాబీయులు సంఖ్యలో ఎక్కువ జనులు, బలమైనవారు. వారి భూమి సారవంతమైనది, వారి పట్టణాలు పెద్దవి. వారి పాపమునుబట్టి, వారి భూ భాగము ముండ్ల చెట్లకును, ఉప్పు గోతులకును స్థానమై నిత్యము పాడుగా ఉండునని ప్రవచింప బడింది (జెఫన్యా 2:9) – ప్రతి పట్టణము పాడైపోవును, మరియు మోయాబు జనము కాకుండ నిర్మూలమాయెను (యిర్మీయా 48:42). దాని ఖచ్చితమైన నెరవేర్పుగా, యిప్పుడు ప్రయాణీకులు ప్రాచీన పట్టణాల శిథిలాలను మాత్రమే కనుగొంటారు. కొన్ని బండలలో, గుహలలో జన సంచారముంటుంది, కాని దేశముగా మోయాబు లేనేలేదు.

### అమ్మోనీయులు

మోయాబీయులవలె అమ్మోనీయులు కూడా సారవంతమైన భూ భాగంపైననే జీవించారు, మరియు వారి దేశము జన సమృద్ధిగలదై యుండేది. వారి పాపమును బట్టి, అమ్మోను సంపూర్ణంగా లయమౌతుందని దేవుని ప్రవచనపు వార్త ముందుగా తెలియజేసింది. అమ్మోనీయుల పట్టణమైన రబ్బా పాడు దిబ్బయగును అని చెప్పబడింది

(యిర్మీయా 49:2). అది అలాగే కన్పిస్తుంది. ముండ్ల చెట్లకును, ఉప్పు గోతులకును స్థానమై "నిత్యము పాడుగా" ఉండునని ప్రవచింపబడింది (జెఫన్యా 2:9). నేడు, ప్రతి దిశలోను శిథిలాలే ఉంటాయి. జనముతోనూ, దేశముతోనూ అమ్మోను దూరమయింది. సంపర్కమునకు దూరమై విస్మరించబడింది (యెహెజ్కేలు 25:7, 10). ఈ రోజు ఎవడును తాను అమ్మోనీయుడనని పిలుచుకోడు, ఏ దేశమైనా, జనమైనా అమ్మోను సంతతివారమని చెప్పుకోరు.

**ఎదోమీయులు**

పదిహేడు వందల సంవత్సరాలు, ఎదోమీయులు బలమైన, పెద్ద సమూహంగా ఉన్నారు. ఎదోము అనేక పట్టణాలను కలిగి ఉంది. దాని రాజధాని నగరం, పెట్రా (సెలా), వ్యాపార కేంద్రమైయుండి, ఐగుప్తు, పాలస్తీనా, సిరియాలనుండి బిడారు వర్తకులను ఆకర్షించేది. దానితోపాటు, ఖగోళ శాస్త్రంలోను, సముద్రయానంలోను ఎదోమీయులు పరిశోధనలు సాగించి కీర్తిని గడించారు.

ఒకప్పుడు ప్రముఖ జనముగానున్న ఈ ప్రజల పాపము దేవుని తీర్పును, శాపమును తెచ్చిపెట్టింది. ప్రవక్తల ప్రకారం (యెషయా 34:5-10), ధనవంతమును, సౌభాగ్య వంతమునునైన ఈ దేశము తరమునుండి తరమునకు క్షీణించిపోతుంది. జన సంచారము లేకుండ, ముండ్ల పొదలును, దురదగొండ్లును గచ్చలును పుట్టును. అడవి జంతువులకును, పక్షులకును అది ఉనికి పట్టగును (యెషయా 34:13-15; యిర్మీయా 49 కూడా చూడు). ఎదోము నశించును.

తీక్షణమైన ఈ ప్రవచనముల విషాదకరమైన నెరవేర్పు బైబిలుకు గౌరవాన్ని తెస్తుంది. ఎదోము దేశంగా ఉండడం నిలిచిపోయి యిప్పటికి పందొమ్మిది వందల సంవత్సరా లౌతుంది. ఎదోమీయుడనని చెప్పుకొనేవాడెవడో ఏ నరునికి తెలియదు. అంత ఐశ్వర్యంగల బలమైన పెట్రా అనే పట్టణం నిర్మానుష్యమై అది విడిచిపెట్టబడడాన్ని ముందుగా మానవ మాత్రుడు ఊహించలేదు. అసలు ఆ చోటే శతాబ్దాల తరబడి తెలియకయే ఉంది; అయితే దాని శిథిలాలు కడకు కనబడ్డాయి, దానితో యింకా ముప్ఫై పట్టణాల శిథిలాలు కనబడ్డాయి. కొద్దిమంది అరబ్బీ పశువుల కాపరులు తప్ప అవి విడిచి పెట్టబడ్డాయి - అక్కడ ఉన్న తేళ్లనుబట్టి ఆ శిథిలాలను విసర్జించారు.

**ఫిలిష్తీయులు**

ఫిలిష్తీయ తొలిగా పెద్ద సారవంతమైన దేశం. అష్కెలోను, అష్డోదు, ఎక్రోను మరియు గాజా అనేవి ప్రాకారములుగల పట్టణాలలో చేరినై. అష్కెలోను బహు శ్రేష్ఠమైన ద్రాక్షలకు ప్రసిద్ధిగాంచింది. అష్డోదు "చరిత్రలో బహు దీర్ఘమైన ముట్టడిని" ఎదుర్కొంది. మూడు అంతస్థుల మేడలతోను, పెద్ద స్నాన వాటికలలోను గాజా ధనికమైన పట్టణమైయుంది. మహా అలెగ్జాండర్ వంటివారిని సహితం దాని బలమైన ప్రాకారాలు రెండు నెలలవరకు ఆపగలిగాయి.

పాపము ఎవరికైనా చేటు కలిగిస్తుంది, ఏదియేలాగున్నా, ద్వేషబుద్ధిని బట్టి, తిరుగుబాటును బట్టి, తక్కిన యితర పాపాలను బట్టి, దేవుని ప్రవచనపు వాక్కులను బట్టి ఫిలిష్తీయ నాశనమయ్యింది. దాని బలమైన పురములు అణచబడి, ఏమిలేని స్థితికి దిగజారాయి. ఎక్రోను, ఎష్కెలోను, అష్డోదు, గాజా అనేవి వాటి పేర్లతో ప్రత్యేకించి ప్రవచింపబడ్డాయి (జెఫన్యా 2:4). ఎడారి దేశంగా ఫిలిష్తీయా బెడూలిన్ అరబ్బులకు విడిచిపెట్టబడింది, వారు అక్కడ తమ మందలను మేపుకుంటారు. అష్డోదు యొక్క శిథిలాలు తేళ్లకు ప్రసిద్ధి గాంచింది. ఏ గుట్ట ప్రాచీనమైనదో అని తెలియక దెబ్బలాడుకుంటారు. మహా అలెగ్జాండరు గాజాను సంపూర్తిగా నాశనం చేశాడు. సముద్రంనుండి రెండుమైళ్లు ఆ పట్టణము విడిచిపెట్టబడింది. అది ఒకమైలు దూరం కట్టబడింది. ఇది క్రొత్త చోటులో కట్టబడిన సంగతి కొంత మందికి తెలియక పోగా, నిర్ధారితంగా రాసేవాళ్లు "పాత గాజా," "క్రొత్త గాజా" అని వాటిని పిలుస్తారు. పాత పట్టణాన్ని "గాజా ఎడారి" అని ప్రత్యేకించి పిలుస్తారు.

**ఐగుప్తీయులు**

ఒకప్పుడు ఐగుప్తులో అభివృద్ధిచెందిన ఇరవైవేల పట్టణాలుండేయి; అయితే దేవుని ప్రవచన వాక్యంతో సమన్వయం కలిగియుండడానికిగాను, ఐగుప్తు నిర్జనమయ్యింది (యెహెజ్కేలు 29:12). ఈ నాటికి కూడా, ఐగుప్తులో ఎక్కువ భాగము నిర్జనంగానే ఉంటుంది. జాతీయ ఏలికలను "తగ్గించెదను" అన్న మాటలు ప్రవక్త ద్వారా పలుకబడినవి (యెహెజ్కేలు 29:15). రెండువేల సంవత్సరాలకు ఈ ప్రవచనం నెరవేర్చబడింది.

బబులోను, నీనెవె, మోయాబు, అమ్మోను, ఎదోముల పూర్తి నాశనముతో కూడిన ప్రవచనాలకు భిన్నంగా, నిర్మూలము అనే ఆజ్ఞ ఐగుప్తుకు విరోధంగా జారీ చేయబడలేదు. ఐగుప్తు లేకుండా పోవడం కాదు గాని అది హీనమౌతుందని మాత్రమే చెప్పబడింది. అది హీనమైన రాజ్యముగా యితర రాష్ట్రములమీద ప్రభుత్వం చేయకుండ బలహీనమై 2000 సంవత్సరాలయింది (యెహెజ్కేలు 29:15). మునుపటి ఔన్నత్య స్థితికి పునరుద్ధరించాలన్న సకల ప్రయత్నాలు విఫలమయ్యాయి, మహా శక్తిగల నెపోలియన్‌వంటి వారి ప్రయాసలతో సహా.

**క్రైస్తవులు**

భవిష్యత్ రాజ్యమును గూర్చి పాత నిబంధన ప్రవక్తలు గొప్ప విషయాలను ప్రవచించారు. దాని ఏకైక రాజు రెండవ దావీదైయుంటాడు. ఆయన సింహాసనము దయా, కృపలవలన స్థాపింపబడుతుంది (యెషయా 16:5). ఆయన బలవంతుడగు దేవుడు అని పిలువబడతాడు (యెషయా 9:6). ఆయన జనులు యిష్టపూర్వకంగా వస్తారు (యెషయా 2:3). ఆయన ఏలుబడి ఆత్మ సంబంధమైనదై యుంటుంది (యెషయా 2:4 చూడు). ఆయన ఆధిపత్యము సార్వత్రికమైనది, లయము కానిది, రోమా సామ్రాజ్య దినములలో ఆరంభమైనదై నిత్యముండునది (దానియేలు 2:44).

ఈ ప్రవచనాల నెరవేర్పులు మహా అద్భుతంగా ఉంటాయి! రోమా రాజుల కాలములో,

ఈ లోక సంబంధంకాని రాజ్యమొకటి, పరలోకంనుండి వచ్చే ఏలుబడి – నీతి పరిపాలన, సమాధానము, సంతోషములతో కూడినదై – దావీదుకు దైవికమైన కుమారుదు రాజుగా భూమిమీద ప్రారంభించబడింది. పరలోక సంబంధమైన ఈ రాజ్య పౌరులు క్రైస్తవులన బడ్డారు. అలాటి రాజ్యమును గూర్చిన ప్రవచనము ధైర్యముతో కూడినదై, ఖచ్చితమైన దాని నెరవేర్పు దాదాపు నమ్మలేనట్టుంటుంది.

## వ్యక్తులకు పేర్లు పెట్టిన ప్రవచనాలు

నిశ్చయమైన ప్రవచన వాక్యము పేర్కొన్న పట్టణముల, జనముల గమ్యాలను ముందుగా చూడగలగడం మాత్రమేగాక, ప్రత్యేకించిన వ్యక్తులను కూడా చూడగలిగింది.

### యోషీయా

ఆ సంఘటనకు రమారమి మూడు వందల సంవత్సరాలకు ముందు, “దైవ జనుడైన యొకడు” “యెహోవా ఆజ్ఞచేత” (1 రాజులు 13:1), దావీదు సంతతిలో పుట్టబోవు వాని పేరును, అతడు ఏమి చేస్తాడో ముందుగా తెలియజేశాడు. దావీదు యింటికి పుట్టబోవు ఒక కుమారుని గూర్చి ఆ ప్రవచనం పలుకబడింది; అతనికి యోషీయా అను పేరు పెడతారని సూటిగా చెప్పబడింది, విగ్రహారాధనను భంగం చేయడంలో దేవుని యెడల అతడు కనుపరచే ఆసక్తిని గూర్చి ప్రవచింపబడింది (1 రాజులు 13:2). కేవలం నరమాత్రునివలన ఈ కార్యము జరుగదు.

### రేకాబు

క్రీస్తుకు ఆరు వందల సంవత్సరాలకు పూర్వము, కొందరు కుమారులు తమ తండ్రులకు లోబడినందున, దేవుడు ఆ కుటుంబాన్ని శాశ్వతంగా దీవించాడు (యిర్మీయా 35:18, 19). మక్కాకు సమీపంలో పందొమ్మిదవ శతాబ్దంలో, వారు రేకాబు సంతతియైనట్టును, పవిత్రమైన యూదా మతస్థులైనట్టును, హెబ్రీ భాష ఎరిగిన వారైనట్టును చెప్పుకొన్న దాదాపు ఆరు వేలమంది కన్పించారు.

### సిద్కియా

దేవుని యెడల మర్యాదలేని దుష్టుడైన సిద్కియా దుఃఖకరమైన ప్రతిదండనను పొందాడు. సిద్కియా బబులోను పట్టణానికి ఖైదీగా కొనిపోబడతాడని, అక్కడనే అతడు చస్తాడని, అయినా అతడు బబులోనును ఎన్నడు చూడడని ప్రవక్త ప్రకటించాడు (యెహెజ్కేలు 12:13). నిజదేవుని ఎరుగని రాజగు నెబుకద్నెజరు ఏమి చేయబోతాడో దానిని గూర్చిన ముందు జ్ఞానం ఎంతగా ఈ ప్రవచనం కోరుతుంది. ఈ దురదృష్టవంతుడైన సిద్కియాను ఖైదీగా బబులోనుకు కొనిపోకమునుపు అన్య రాజు హెబ్రీయుల ప్రవచనాన్ని నెరవేర్చాలన్న కుట్రతో అతని కన్నులను ఊడదీయించలేదని మనం నిశ్చయంగా చెప్పవచ్చు.

**యాంటియోకస్**

“పిచ్చి మనిషి”[2] అనబడే యాంటియోకస్ IV (ఎఫిఫినాస్) ను గూర్చి దానియేలు యొక్క ప్రవచనం ఎంతో సరియైనది, ఎంతో ఖచ్చితమైనది. యాంటియోకస్ ఏలుబడికి నాలుగు వందల సంవత్సరాలకు ముందు అది వ్రాయబడియుండడానికి వీలులేదు అని నమ్మనివారు ఊరకనే అంటారు (దానియేలు 8 మరియు 11 చూడు). అది ఎంత స్పష్టంగా ఉందంటే – అది చరిత్రయేగాని ప్రవచనం కాదు అని విమర్శకులు ఉద్ఘాటిస్తారు.

దానియేలు గ్రంథం యొక్క కర్తృత్వాన్ని ఏ డాక్యుమెంటరీ ఎవిడెన్స్ తప్పుగా రుజువు చేయలేదు. దానియేలు పేరు క్రింద తరువాత ఫోర్జరీ చేయబడింది అనడం, అలాటి విషయాలు దేవుడు తన గ్రంథంలోనికి రానిచ్చాడని తలంచడం, దేవుని యొక్కయు ఆయన వాక్యము యొక్కయు స్వభావానికి భిన్నమైయుంటుంది. సూటియైన సత్యం, దానియేలు ప్రవచనం ఎంత ఖచ్చితమైనదంటే, అది మానవాతీతమైన డాక్యుమెంటు అనే రుజువును భంగపరచడానికి ఒకే మార్గం ఫోర్జరీయని దాన్ని అపహాస్యం చేయడమే.

**యేసు**

**సామాన్యంగా ఆశించేది** (General Expectancy). రాబోయే మెస్సీయాను గూర్చి హెబ్రీ ప్రవక్తల రచనలు ఒక సామాన్యమైన ఆశను రేకెత్తించాయి. “రాబోవు వాడవు నీవేనా? ...” (యోహాను 11:3) అనే ప్రశ్న వారందరి విశ్వాసాన్ని బయలుపరచుతుంది. లోకాన్ని ఆశీర్వదించడానికి ఒక ప్రత్యేకమైన వ్యక్తి వస్తాడనే ఆశ యూదుల్లోనేమి అన్య జనులలో కూడా ఉండేది.

**సమయం సూచించబడింది** (Time Specified). దైవ ప్రేరేపితులైన ప్రవక్తలు – మెస్సీయా రాకను గూర్చి చెప్పడం మాత్రమే గాక, ఆయన రాబోయే కాలాన్ని కూడా వారు ప్రకటించారు. అది రోమా ప్రభుత్వం ఉనికిలోనున్నప్పుడు (అది క్రీ.పూ. 65నుండి క్రీ.శ. 476వరకు). రెండవ దేవాలయం యింకను నిలిచి యుండగనే: క్రీ.శ. 70కి ముందు సమస్త జనముల ఆశ నెరవేర్చబడుతుంది. వంశావళుల యొక్క జాబితాలు నాశనం కావింపబడక మునుపే: క్రీ.శ. 70కి ముందే, యూదాలోనుండి ఏలిక రావలసియుంది. అభిషిక్తుడగువాడు, ఏలిక, యెరూషలేము నాశనానికి ముందే: క్రీ.శ. 70కి ముందే, రావాలి లేక వస్తాడు. అందువలన, రోమా సామ్రాజ్య స్థాపనం జరిగిన క్రీ.పూ. 65, యెరూషలేము నాశనం, క్రీ.శ. 70 అనే వాటి మధ్య లోకం తన రక్షకుని కొరకు కనిపెట్టుతుంది.

**కొన్ని వర్ణనలు, బిరుదులు.** క్రీస్తును గూర్చి ముందుగా సూచింపబడ్డ వర్ణనలు, బిరుదులు ఈ క్రింద సూచింపబడ్డాయి: షిలోహు (ఆది. 49:10), యాకోబులో నక్షత్రము (సంఖ్యా. 24:17; KJV), ప్రవక్త (ద్వితీయో. 18:15), రాబోవువాడు (కీర్తన. 118:26; KJV), దావీదుకు ప్రభువు (కీర్తన. 110:1), దేవుని కుమారుడు (కీర్తన. 2:7, 12), సీయోను రాజు (కీర్తన. 2:6), మెస్సీయా (కీర్తన. 2:2), ఆరాధనకు పాత్రుడు (కీర్తన. 2:12 చూడు) ఇమ్మానుయేలు (యెషయా 7:14), తగులు రాయి (యెషయా 8:14), ఆశ్చర్యకరుడు, ఆలోచన కర్త, బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాధాన

కర్తయగు అధిపతి (యెషయా 9:6), జనులకు ధ్వజముగా నిలుచువాడు (యెషయా 11:10), అమూల్యమైన మూలరాయి (యెషయా 28:16), దేవుని సేవకుడు (యెషయా 42:1), ఏర్పరచుకొనినవాడు (యెషయా 42:1), నీతిమంతుడు (యెషయా 42:6), అన్య జనులకు వెలుగు (యెషయా 49:6), రక్షకుడు (యెషయా 49:6), యెహోవా హస్తము (యెషయా 53:1), గొర్రెపిల్ల (యెషయా 53:7), సాక్షి (యెషయా 55:4), అధిపతి (యెషయా 55:4), నాయకుడు (యెషయా 55:4), సువార్తను ప్రకటించువాడు (యెషయా 61:1), విమోచకుడు (యెషయా 62:11), యెహోవా మనకు నీతి (యిర్మీయా 23:6), దావీదు (హోషేయ 3:5), ఏలు అధిపతి (యిర్మీయా 30:21), చిగురు (యిర్మీయా 23:5), కాపరి (యెహెజ్కేలు 34:23), మనుష్య కుమారుడు (దానియేలు 7:13) నిత్యము ఏలు అధిపతి (మీకా 5:2), జనముల యొక్క యిష్టము (హగ్గయి 2:7; KJV), దేవాలయం యొక్క ప్రభువు (మలాకీ 3:1), నిబంధన దూత (మలాకీ 3:1), నీతి సూర్యుడు (మలాకీ 4:2). ("మెస్సీయాను గూర్చిన ప్రవచనాలు" అనే పాఠాన్ని చూడు).

**సంభవింపదగిన చట్టము.** యేసునుగూర్చి ఒకవేళ ఏభై ప్రవచనాలు మాత్రమే చేయబడి, అవి నెరవేరుతాయి, నెరవేరవు అనేదానికి సమానమైన ఛాన్స్ యివ్వబడి యున్నట్టు ఊహించినట్టయితే ఆ ఏభై నెరవేర్చబడకపోవచ్చు. వాస్తవంగా, "దట్ ఆఫ్ ది ఫిఫ్టీయత్ పవర్ ఆఫ్ టు (ఇన్ ఫినిటీ); అంటే, ఇవన్నీ సమానంగా రావాలంటే, అలాటి అవకాశము 1,125 మిలియన్ల కంటె ఎక్కువై ఉంటుంది."[3] ఈ ఏభై సంఘటనలు సమకాలికంగానే సంభవించాలని ఊహించితే, "వాటి నెరవేర్పు విస్తృతంగా నమ్మశక్యం గానివని సరిగా వివరించటానికి సంఖ్యా శక్తికి వీలుకాదు."[4] దేవుని పరంగాను, విరోధంగాను ఉన్న స్వతంత్ర ప్రతినిధుల ఆలోచనలను, క్రియలను ఈ లెక్కింపు పరిశీలన లోనికి తీసుకోలేదు. అంటే, "జనుల ఉద్రేకాలను, రాజుల అత్యాశలు, జ్ఞానుల అధ్యయనం, దుష్టుల నైపుణ్యత, యుద్ధాలు, విప్లవం, దేశాల పలురకాల గమ్యాలు."[5]

వంద ప్రవచనాలు మాత్రమే చేయబడినట్టయితే, ఒక మనిషి జీవితంలో అవి నెరవేర్చబడే అవకాశం ఎలా ఉంటుందంటే, లోకమంతా సంపూర్తిగా నీరుగా మారిపోయి, ఆ నీరంతా ఎన్ని బిందువులౌతాయో, వాటిలో ఒక బిందువు కంటె తక్కువై యుంటుంది.

దీన్ని ఆలోచించు: 50 కాదు, లేక 100 కాదు, 332 క్రీస్తును గూర్చిన ప్రవచనాలు లెక్కించబడ్డాయి! అందువలననే, క్రీస్తు యిలా ఉద్ఘాటించాడు, "ఎవడైనను ఆయన చిత్తము చొప్పున చేయ నిశ్చయించుకొనిన యెడల, ఆ బోధ దేవునివలన కలిగినదో, లేక నా యంతట నేనే బోధించుచున్నానో, వాడు తెలిసికొనును" (యోహాను 7:17). ప్రకృతిలోనున్న రుజువులు నాస్తికులను నిరుత్తరులనుగా చేస్తున్నట్టు, ప్రవచనపు వాక్యములోని రుజువులు అవిశ్వాసులను నిరుత్తరులనుగా చేస్తాయి.

యేసు ప్రవచనాలను నెరవేర్చాడన్న విషయం సాధారణంగానే అంగీకరింప బడుతుంది. ఈ నిరూపణను కాదనడానికి ఒకే ఒక మార్గం, ఆ ప్రవచనాలన్నీ యేసు వచ్చిన తరువాతనే వ్రాయబడ్డాయని స్థాపించగలగాలి. ఈలాటి ఉద్ఘాటన, అవిశ్వాసుల చేతనే తప్పుగా రుజువు చేయబడుతుంది. యూదా మతపు అవిశ్వాసులు సైతం, పాత నిబంధన రచనల ప్రాచీనతను మూల గ్రంథంలోని వాక్య భాగాల ఖచ్చితత్వాన్ని బలంగా

రూఢిపరుస్తారు. ఈ విధంగా, యూదుల్లోని అవిశ్వాసులు క్రీస్తునందు యిష్టం లేకుండానే ఆయన సంభవానికి కానుకను సమర్పిస్తారు!

## యేసుచే యివ్వబడిన ప్రవచనాలు

రానైయున్న క్రీస్తును గూర్చి యివ్వబడిన 332 ప్రవచనాలలో, ఆయనయే ప్రవక్తయై ఉంటాడు అనేది ఒకటి. వాస్తవానికి, ప్రవచింపగల తన సామర్థ్యంలో తన దేవత్వానికి ఆయన నిరూపణ చేశాడు. వడ్రంగి పని చేసే సువార్తికుడు తన్ను వెంబడించే కొద్ది మందితో, తన సొంత మరణాన్ని గూర్చి ప్రవచించాడు (మత్తయి 16:21; మార్కు 9:31; లూకా 9:22), అయినా తన ఉద్యమం ముందు విస్తరించబోతుందని ఆయన ప్రవచించాడు. ఆయన ప్రాముఖ్యతలేని ప్రవక్త మాత్రం కాదు! ఆయన మరణానంతరం తన్ను అనుసరించడం ఎలా విస్తరిస్తుంది అనేదే బహు అద్భుతం.

యేసు చెప్పిన అనేక ప్రవచనాలలో ఇరవైయయిదు యెరూషలేము పట్టణాన్ని గూర్చినవి. శాంతిగానున్న కాలంలో, దాని సంపూర్ణ నాశనాన్ని గూర్చి ఆయన ధైర్యంగా ప్రకటించాడు (మత్తయి 16:21; మార్కు 9:31; లూకా 9:22). మహా గొప్ప తెల్ల చలువరాయి, 50 x 24 x 16 అడుగుల సైజుకలది, దేవాలయం యొక్క మహిమ – ఒక దానిమీద ఒకటి నిలువదట (మత్తయి 24:2; మార్కు 13:2; లూకా 21:6). పట్టణం టైటస్‌చేత పడగొట్టబడిన తరువాత, ఇది నెరవేర్చబడింది. అగ్ని దేవాలయపు బంగారాన్ని కరిగించింది, "కరిగిపోయిన నిధిని సమకూర్చుకొనడానికిగాను, చివరి అడుగువరకు రాళ్లు త్రవ్వబడ్డాయి." శృంగారమైన ఆ కట్టడాన్ని రక్షించడానికి సైన్యాధిపతియైన టైటస్ ప్రయత్నించాడు కాని, తన సైనికుల ఆగ్రహమును అతడు ఆపలేకపోయాడు. అందమైన మిక్కిలి వెలగల భవనాన్ని రక్షించ ప్రయత్నించడంలో, టైటస్ అనుకోకుండగనే క్రీస్తు మాటకు విరోధంగా పని చేశాడు. అయినా, ఏమి జరుగబోతుందో ప్రభువుకు తెలుసు. "ఇదిగో ముందుగా నేను మీతో చెప్పుచున్నాను" అని ఆయన అన్నాడు (మత్తయి 24:25). రోమీయులయొక్క సాహస కృత్యము వారి ఆయుధాలవలన కాక, దేవుని చిత్తమువలననే జరిగినట్టు టైటస్ తరువాత గుర్తించాడు.

కపట క్రైస్తవులు వస్తారని యేసు చెప్పాడు. దైవ ప్రేరేపితులైన వారన్నట్టు గొప్పగా చెప్పుకున్నవారి పేర్లను చరిత్ర దాఖలు చేసింది. ఆయన మాటల ప్రకారము, యుద్ధములు, యుద్ధములను గూర్చిన సమాచారము, కరవులు, భూ కంపాలు వస్తాయన్నాడు (మత్తయి 24:6, 7; మార్కు 13:7, 8). యుద్ధములు, యుద్ధములను గూర్చిన సమాచారం మాత్రమే గాక, – క్లౌదియ చక్రవర్తి పరిపాలనా కాలములో – కరవు, తెగుళ్లు, భూ కంపాలు కూడా జరిగాయి. ఆకాశములో సూచనలు కనబడునని ప్రభువు చెప్పాడు (లూకా 21:11). గౌరవనీయులైన చరిత్రకారులు, అవిశ్వాసులైనా, మానవ మనస్సుల్లో గాఢంగా నాటుకున్న అసాధారణమైన దృశ్యాలను రికార్డు చేశారు. యెరూషలేము పతనానికి ముందు ఘోరమైన హింసాకాండ ఉంటుందని ఆయన తెలిపాడు (మత్తయి 24:9). ఈ విధంగా నీరోయు, యింకా యితర చక్రవర్తులు క్రైస్తవ్యానికి ఏమి చేయబోతారో యేసుకు ముందే తెలుసు.

హింసలను బట్టి, అనేకమంది క్రైస్తవులు తమ విశ్వాసాన్ని వదులుకుంటారని యేసు ప్రవచించాడు (మత్తయి 24:10). వీటిని గూర్చి చరిత్ర తెలుపుతుంది. యెరూషలేము పతనానికి ముందు లోకమంతా సువార్త వినవలసియుంటుంది. క్రీ.శ. 30నుండి 70 వరకు క్రైస్తవ్యం వ్యాపించిన రికార్డు చరిత్రలోనే బహు వింతైన అధ్యాయమైయుంటుంది. యెరూషలేము పట్టణం చుట్టు సైన్యాలు ముట్టడి వేయడానికి నలభై సంవత్సరాలు ముందుగా, తన శిష్యులు తప్పించుకునే అవకాశముంటుందని ప్రభువునకు తెలుసు. మరోవైపు, రోమా సైన్యాధిపతియైన సెస్టియస్ గేలస్ పట్టణపు ముట్టడిని ప్రారంభించి, మరల ఎందుకు వెనుకకు తీసికొన్నాడో చరిత్ర కారులకు యింకను తెలియకుంది. తిరిగి ప్రారంభం కాక మునుపు వేలకొలది మంది క్రైస్తవులు, పారిపొమ్మని ప్రభువు యిచ్చిన సలహా మేరకు, యెరూషలేమును విడిచిపోయి తమ ప్రాణాలను దక్కించుకున్నారు. అవిశ్వాసులైన యూదులైతే నాశనం చేయబడ్డారు లేదా బానిసలుగా అమ్మబడ్డారు.

తాను ఎంతో ప్రేమించిన యెరూషలేము పట్టణము, దేని గూర్చి తన కన్నీళ్లు విడిచాడో ఆ పట్టణం, లోకంలోనే అతి ఘోరమైన శ్రమలను అనుభవించబోతుందని ప్రభువు ముందుగానే తెలిపాడు. కడకు అది ఎలా సంభవించిందన్న విషయాన్ని ఫ్లేవియస్ జోసీఫస్ అనే ఒక విశ్వాసి అయిన చరిత్ర కారుడు తెలియజేశాడు. నరమాంస భక్షం రహస్యమైన చోట్ల జరిగిపోగా, 11,00,000 మంది నివాసులు చంపబడ్డారు. 97,000 మంది చెరగొనిపోబడ్డారు. అనేక సంవత్సరాల తరువాత, భవనం ఉన్నట్టుగా సాక్షులు రిపోర్టు చేశారు. దేవాలయంలో అర్పింపబడిన కడపటి బలి జూలై 16న జరిగింది, ఆగష్టు 9న, క్రీ.శ. 70న పట్టణం దహించబడింది.

రాబోయే యెరూషలేము యొక్క అంతం అనే ఆశ్చర్యకరమైన వాస్తవాన్ని ముందుగా తెలియజేయడం మాత్రమే కాక, ఆనాడు జీవించుతున్న జనుల తరంలోనే జరుగుతుందని ప్రత్యేకించి ఆయన చెప్పాడు. నలభై సంవత్సరాల తరువాత, చెప్పిన కాలానికే, ఒక అన్యుల సైన్యం ఆయన మాటను నెరవేర్చింది.

అత్యల్పమైన వివరణలతో కూడిన ప్రభువు యొక్క భవిష్యత్ జ్ఞానం యొక్క విలువను తగ్గించాలంటే యెరూషలేము పతనం అయిన తరువాతనే ఆయన శిష్యులు ఈ ప్రవచనాలను చెప్పాలి. ఏదియెలాగున్నా, ప్రభువు యొక్క ప్రవచన వాక్యాలు దాఖలు చేయబడిన మూడు సువార్త రచనలు యెరూషలేము నాశనమునకు ముందే ప్రచురించ బడ్డాయని అనేకమైన రుజువులు సూచిస్తున్నాయి. అవి కేవలం ఎల్లరికి అందజేయబడడం మాత్రమే కాదు, కాని సువార్త రచనల్లో కన్పించిన సలహా మేరకు క్రైస్తవులు జరిగించి నట్టున్నారు. ఈ ప్రవచనాలు యివ్వని ఒకే సువార్త యోహానుచే వ్రాయబడింది, ఇది క్రీ.శ. 70 తరువాతనే ప్రచురింపబడింది.

ప్రభువు యొక్క ప్రవచన వాక్య విశేషాలు ఎంత గణనీయమైనవో వాటి ఖచ్చితమైన నెరవేర్పులు కూడా అలాటివే, అయినా యేసు ముందుగా చెప్పబడిన ఈ మాటలను నిరర్థకం చేయాలని బుద్ధి పూర్వకంగా ఆశ్చర్యకరమైన ప్రయత్నాలు జరిగాయని చరిత్ర చెప్పుతుంది. యెరూషలేము పతనానంతరం, అది అన్య జనులచే త్రొక్కబడుతుందని చెప్పాడు. మత విశ్వాసాన్ని వదులుకున్న జూలియన్ చక్రవర్తి (క్రీ.శ. 331-62), క్రైస్తవ్యం

మీదనున్న ద్వేషంతో, అన్య జనులను తొలిగించి యెరూషలేములో యూదులను తిరిగి స్థాపింపబూనాడు. దేవాలయాన్ని తిరిగి కట్టాలన్న అతని ప్రతి ప్రయాస ఆటంకాలను ఎదుర్కొంది; కొన్ని ప్రకృతి సిద్ధమైనవి, కొన్ని మానవాతీతమైనవిగా చెప్పబడ్డాయి. చాలా వ్యయప్రయాసలైన తరువాత, కడకు జూలియన్ ఆ పనిని మానుకున్నాడు. "గలిలయుడా, నీవే జయించావు" అని అతని మరణ సమయంలో గట్టిగా కేకవేసినట్టు చెప్తూతారు.

## ముగింపు

పాత, క్రొత్త నిబంధన ప్రవచనాల నెరవేర్పును గూర్చిన మనోహరమైన పఠనం దైవికమైన కర్తృత్వాన్ని మాత్రమే సూచిస్తుంది. హటాత్తుగా ఏక కాల సంభవాలు అవ్వడానికి వీలులేనంత సూటిగా ప్రవచనాలు చెప్పబడ్డాయి; అవి ఊహలు అనడానికి వీలులేనంత ఖచ్చితంగా నెరవేర్చబడ్డాయి. దేవుని వాక్యం దైవ ప్రేరేపితమని అవి మనలను ఒప్పించును గాక.

సూచనలు

[1]కల్దీయ అనేదాన్ని సరిగా చెప్పాలంటే, బబులోనియలోని దక్షిణ భాగమైయుంది. ఈ ఏరియాలో కల్దీయులు ప్రబలమైన పిమ్మట, వారు నూతన బబులోను సామ్రాజ్యాన్ని స్థాపించారు. "కల్దీయ దేశమని" హెబ్రీ ప్రవక్తలు ఉపయోగించినప్పుడు, బబులోనియ అంతటికిని, మరియు "కల్దీయుల" అంటే, బబులోను సామ్రాజ్యములో సభ్యులైన అందరికిని అని అర్థం వస్తుంది. [2]యాంటియోకస్ IV (ఎఫిఫినాస్); క్రీ.పూ. 175నుండి 164 సిరియాను పాలించిన సెలూసిడ్ రాజు, పాత, క్రొత్త నిబంధనల మధ్యగల నాలుగు వందల సంవత్సరాల కాలంవాడు. గ్రీకు నాగరికతను అతడు తన జనులమీద రుద్దనారంభించాడు, యూదాలోనున్న వారిమీద కూడ. యూదా మతాన్ని లయపరచాలన్న తన ప్రయత్నాలలో సున్నతి, సబ్బాతు ఆచరణను, ధర్మశాస్త్ర పఠనాన్ని నిలిపివేయ ప్రయత్నించాడు. దేవాలయం యొక్క పవిత్రత చెరపబడింది; యూదులు విగ్రహ సంబంధమైన ఆరాధనలో పాల్గొని, అపవిత్రమైన భోజనం చేసేలా బలవంతం చేయబడ్డారు. జూడస్ మెక్కబీ తిరుగుబాటు ఆరంభించాడు, చివరకు యూదులు స్వతంత్రులవ్వడానికి అది దారి తీసింది. క్రీ.పూ. 141లో, సిరియా స్వాధీనంలోనుండి దేశం స్వతంత్ర్యాన్ని పొందింది. మెక్కబీల తిరుగుబాటు, దానికి నడిపించిన సంఘటనలు దైవ ప్రేరేపితంకాని మెక్కబీ 1, 2 గ్రంథాల్లో దాఖలు చేయబడ్డాయి. [3]Alexander Campbell, *The Evidences of Christianity: A Debate* (Cincinnati: Chase and Hall, 1878), 334-35. [4]Ibid. [5]Alexander Keith, *Evidence of Truth of the Christian Religion Derived From the Literal Fulfillment of Prophecy* (Philadelphia: Presbyterian Board of Publication, n.d.), 368-69.

**బైబిలు ప్రవచనాలకు విరుద్ధంగా మానవ ప్రవచనాలు**

బైబిలు ప్రవచనానికి, మానవ ప్రవచనానికి మధ్యగల సంబంధం తారతమ్యమే గాని, పోలిక ఏ మాత్రం కాదు. ఇది నిరూపించగల దాని విషయంలోనే గాని, నైతిక, ఆత్మ సంబంధమైనవాటి విషయంలోనే గాని నిజమైయుంటుంది. అన్య ప్రవక్తల మనస్సులు ఐశ్వర్యంమీదనేగాని, నీతి మీద ఉండవు. వారికి స్థానికమైన దేవతలనబడేవారు తెలుసు. వారికి నైతిక శాస్త్రంగాని, రక్షణ గాని ఉండదు. శుద్ధమైన కరములు, పవిత్రమైన హృదయము, ఒకే దేవుడు అనేవాటి విషయంలో బైబిలు ఒంటరిగా నిలుస్తుంది.

భవిష్యత్ విషయాలు చెప్పేదాని విషయంలో, నెరవేర్చబడిన ప్రవచనాలను వెరిఫై చేయగల సంఘటనలు బైబిలు మాత్రమే చెప్పగలదు. ఇస్లాం, బుద్ధిజం, కన్‌ఫూసియనిజం, షింటోయిజం, మరియు జొరాస్ట్రియనిజం అనేవి భవిష్యత్ విషయాలను చెప్పే ప్రయత్నం చేయవు. డెల్ఫిక్ ఆరక్‌ల్ అనే అన్యుడు ప్రవచించ డానికి ప్రయత్నించినప్పుడు, అది ఎల్లప్పుడు స్పష్టం కానిదియు, గూఢమైనదియునై ఉండేది. ప్రవచనమందు యితర ప్రయత్నాలు జరిగినప్పుడు, తమ్మును తామే ప్రవక్తలుగా చేసికొన్నవారికి కలవరం కలిగించేయిగా ఉన్నాయి.

ఇతర మతాలలో ప్రవచనం లేకపోవడం, అన్య ఆరక్‌ల్స్‌లో వ్యర్థ ప్రయాసలై యుండడం, మరియు యితర పరాజితమైన ప్రయత్నాలు–బైబిలు ప్రవచనాన్ని చాలా ఆభినందించదగినది గాను, పోలికవలన గౌరవం భక్తి కనుపరచ వలసింది గాను చేసింది.